సాక్షి అనకాపల్లి

బుధవారం। 8। జనవరి। 2025



ప్రభుత్వాలకు పట్టని సంక్షేమం

ఆటో, మోటారు కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఆటో వర్కర్లు, డ్రైవర్లు ఆరోపించారు. IIలో



రంగురాళ్ల తవ్వకాలపై నిఘా

రంగురాళ్ల తవ్వకాలపై అటవీశాఖ ముందుస్తుగా అప్రమత్తమైంది. ప్రత్యేక నిఘాకు చర్యలు తీసుకుంది. IIలో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 29.0 డిగ్రీల నుంచి 29.6 డిగ్రీల వరకూ, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 8న 18.6 డిగ్రీలు, 9న 18.0, 10న 19.0, 11న 19.5, 12న 19.8 డిగ్రీలు ఉంటాయని పేర్కొన్నారు.



నేడు మోదీ షో

- సాయంత్రం 4.15 గంటలకు విమానాశ్రయానికి రాక
- సిరిపురం నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ వరకు రోడ్‌షో
- బహిరంగ సభకు భారీగా జనసమీకరణ ఏర్పాట్లు
- 5 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్ శాఖ
- ఏయూ పరిసరాలను ఆధీనంలోకి తీసుకున్న కేంద్ర బలగాలు



ఏయూ గేటు మూసివేత



రోడ్డు షో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

విశాఖ సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఆయన రోడ్‌షోతో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన కీలక ప్రాజెక్టులకు ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నాయి. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు, ఆటోల్లో ప్రజలను సమీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ భద్రతా చర్యలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసింది. అలాగే వేల సంఖ్యలో బస్సులు, ఆటోల్లో ప్రజలు వస్తుండడంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు.

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు పక్కా ఏర్పాట్లు

రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

రోడ్ షోతో పాటు బహిరంగ సభ

ప్రధాని మోదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 4.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 4.45 గంటలకు సిరిపురం ప్రాంతంలోని వెంకటాద్రి వంటిల్లు ప్రాంతానికి వస్తారు. అక్కడి నుంచి జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. ఆ రోడ్డులో ఎడమ వైపు వీవీఐపీలకు,



కుడివైపు ప్రజలకు కేటాయించారు. ప్రధాని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళతారు. సాయంత్రం 5.30 గంటలకు ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం రైల్వే జోన్, బల్క్ డ్రగ్ పార్క్.. ఇలా రూ.2 లక్షలు విలువైన కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సభ ముగిసిన వెంటనే రోడ్డు మార్గంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు 6.55 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 7 గంటలకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో భువనేశ్వర్‌కు పయనమవుతారు.

ప్రధాని ప్రారంభించనున్న ప్రాజెక్టులు

సాక్షి, విశాఖపట్నం : ప్రధాని నరేంద్ర మోదీ **విశాఖ పర్యటనలో రూ.2 లక్షల** కోట్ల విలువైన **30 ప్రాజెక్టులకు శంకుస్థాపన,** ప్రారంభోత్సవం **చేయనున్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌తో** పాటు **అనకాపల్లి జిల్లా పూడిమడక** వద్ద రూ.1.85 **లక్షల కోట్లతో ఎన్టీపీసీ** గ్రీన్ హైడ్రోజన్ హబ్, **నక్కపల్లిలో రూ.1,877 కోట్లతో** తలపెట్టిన **బల్క్‌డ్రగ్ పార్క్‌ను వర్చువల్‌గా** శంకుస్థాపన **చేయనున్నారు. రూ.1321 కోట్లతో** ఆనందపురం **మండలంలో వేంపల్లి-దాగలమర్రి** రహదారి **విస్తరణ, ఎన్‌హెచ్-516 పాడేరు** బైపాస్ రోడ్డు **నిర్మాణం, రూ. 302 కోట్లతో** గంగవరం పోర్టు **నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకూ** సుమారు 12 **కి.మీ మేర 3, 4 రైల్వే లైన్ల నిర్మా**ణం, రూ.150 **కోట్లతో విశాఖ-గోపాలపట్నం** వరకు



రాజయ్యపేటలో బహిరంగ వేదిక

సుమారుగా 15 కి.మీటర్ల మేర రైల్వేలైన్ నిర్మాణం, రూ.302 కోట్లతో దువ్వాడ-సింహాచలం రైల్వే లైన్ల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతం(కేఆర్ఐఎస్ సిటీ)కి కూడా శంకుస్థాపన చేయనున్నారు.

రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్

దక్షిణాది రాష్ట్రాలతో పోటీ పడి గత వైఎ**స్సార్‌సీపీ ప్రభుత్వం సాధించి**న బల్క్‌డ్రగ్ **పార్క్‌కు దేశ ప్రధానమంత్రి నరేంద్ర** మోదీ శంకుస్థాపన చేయనున్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ఏర్పాటు కానుంది. గత ఏడాది సెప్టెంబరులో ఈ పార్క్ ఏర్పాటుకు అవసరమైన రెండు వేల ఎకరాల భూములను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ డ్రగ్ పార్క్ కోసం 17 రాష్ట్రాలు పోటీపడ్డాయి. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రాజయ్యపేట పెదతీనార్ల, బోయపాడు, చందనాడ, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల పరిధిలో ఈ పార్క్ ఏర్పాటు కానుంది. రసాయన పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు సరఫరా చేసే ప్లాంట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారు.

ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్

అచ్యుతాపురం మండలంలోని పూడిమడక సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌కు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 1600 ఎకరాల విస్తీర్ణంలో రూ.1.85 లక్షల కోట్లతో పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 20 గిగా వాట్స్ పునరుత్పాదక శక్తి సామర్థ్యంతో పెట్టుబడులు, 1500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్, 7500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో (గ్రీన్ మిథనాల్, గ్రీన్ యూరియా, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ సహా) భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది పూర్తయితే ఏపీ ప్రపంచంలోనే గ్రీన్ ఎనర్జీలో ల్యాండ్‌స్కేప్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. అదేవిధంగా 57,000 మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

5 వేల మందితో భారీ భద్రత

ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. కేంద్ర బలగాలు నగరానికి చేరుకొని ఏయూ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలు రోడ్ షో, బహిరంగ సభ ప్రదేశాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్లతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డ్రోన్ కెమెరాల వినియోగాన్ని నిషేధించారు. మోదీ సభకు భారీగా జనసమీకరణ చేపడుతున్నందున.. 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. 32 మంది ఐపీఎస్ అధికారులను నగరానికి రప్పించారు. అలాగే 18 మంది అడిషనల్ ఎస్పీలు, 60 మంది డీఎస్పీలు, 180 మంది సీఐలు, 400 మంది ఎస్ఐలతో పాటు ఏఆర్, ఇతర సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు బస్సులు, ఆటోల్లో సభకు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య



సిరిపురం వద్ద ప్రధాన రహదారి మూసివేత

తలెత్తకుండా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాధారణ వాహనాల మళ్లింపులపై పలు సూచనలు చేశారు. డీజీపీ ద్వారకా తిరుమల, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

విస్తృత తనిఖీలు



సిరిపురం వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న పోలీసులు

ఇప్పటికే నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటల్స్, లాడ్జిలు, రిసార్టులు, గెస్ట్ హౌస్‌ల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సభ జరిగే ప్రాంతం, వీఐపీ పార్కింగ్‌తో పాటు నగరమంతా స్నిఫర్ డాగ్, బాంబ్ స్క్వాడ్లతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అన్ని ప్రధాన రహదారులలో ఏఎస్సీ, ఆర్ఓపీలు నిర్వహించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో పికెట్స్, గార్డులను ఏర్పాటు చేశారు. నగరంలో ఏపీఎస్పీ ప్లటూన్లను మోహరించడంతో పాటు రిజర్వ్‌గా అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

భారీగా జన సమీకరణ

ప్రధాని సభను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే ఏయూ మైదానంలో జరిగిన ప్రధాని సభకు కనీవినీ ఎరుగని రీతిలో జనాలు తరలివచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ సభపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర మంత్రులు ఇప్పటికే నాలుగు రోజులుగా జిల్లాలో మకాం వేసి భారీ జన సమీకరణ చేపట్టాలని కూటమి నేతలకు ఆదేశాలు జారీ చేశారు. కేవలం విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలను తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ, ప్రైవేటు



మైదానంలో సభకు జరుగుతున్న ఏర్పాట్లు

బస్సులు, ఆటోలను సిద్ధం చేశారు. శ్రీకాకుళం నుంచి 200 బస్సులు, విజయనగరం, పార్వతీపురం నుంచి 400 బస్సుల్లోనే కాకుండా ఉమ్మడి విశాఖ, ఇలా అన్ని ప్రాంతాల నుంచి 2,280 బస్సులు, 2,280 ఆటోలు, 382 మినీ బస్సులు, 150 టాటా మ్యాజిక్‌లలో జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు.

సభకు 600 బస్సులు

అల్లిపురం: ప్రధానమంత్రి మోదీ సభకు జనాలను తరలించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 600 బస్సులు వినియోగిస్తోంది. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సుల ద్వారా ప్రజలను తరలించనున్నారు. దూర ప్రాంతాలకు 60 బస్సులు నడుపుతున్నారు. మిగిలిన బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సిటీ, సబర్బన్, మెట్రో సర్వీసులు దాదాపు నిలిచిపోనున్నాయి. ఇవి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా బస్సుల్లో ప్రజలను తీసుకొచ్చేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. జిల్లాకు చెందిన బస్సులతో పాటు, ఇతర జిల్లాల బస్సుల పార్కింగ్ విషయంలో రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు.

పండక్కి ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం (విశాఖ) : పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ, చర్లపల్లి-శ్రీకాకుళంరోడ్-చర్లపలి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- కాచిగూడ-శ్రీకాకుళం రోడ్(07615) స్పెషల్ రైలు ఈ నెల 11, 15వ తేదీల్లో కాచిగూడలో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడకు, ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్-కాచిగూడ(07616) స్పెషల్ రైలు ఈ నెల 12, 16వ తేదీలలో శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.
- చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్(07617) స్పెషల్ ఈ నెల 8వ తేదీన చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 5.45 గంటలకు దువ్వాడకు అదేరోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07618) స్పెషల్ ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

- ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలి
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్‌ను తొలగించాలి
- వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్

సీతమ్మధార (విశాఖ): విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంత గనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులు కేటాయిస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నేత ఎం. జగ్గునాయుడు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సొంత గనుల గురించి ఇప్పటి వరకు నోరు మెదపని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్.. ఏకంగా ఆర్సెలార్ మిట్టల్‌కు ఏజెంట్‌గా మారారని మండిపడ్డారు. కేంద్ర ఉక్కు మంత్రి కుమార్‌స్వామిని కలిసి రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు నిరాటకంగా ముడి ఇనుప ఖనిజం సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారని ఆరోపించారు. ఈ చర్యను సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తక్షణం మంత్రి పదవి నుంచి భరత్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వమని, సెయిల్‌లో విలీనం



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

చేయిస్తామని, సొంత గనులు కేటాయిస్తామని, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.18వేల కోట్లు మంజూరు చేయించి చర్యలు చేపడతామని చంద్రబాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని గాలికొదిలేశారన్నారు.

ఇప్పుడు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను విశాఖ స్టీల్ ప్లాంట్ పక్కన బల్లెంలా పెట్టటానికి తహతహలాడుతున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్‌పరం కానివ్వమని ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రచారం చేశారని గుర్తు చేశారు. విశాఖ సభలో స్టీల్‌ప్లాంట్‌పై ప్రధానితో స్పష్టమైన ప్రకటన ఇప్పించకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. నిరసనలో సీపీఐఎంఎల్ ప్రజాపోరు జిల్లా నాయకుడు సీహెచ్ దేవా, ఎంసీపీఐ జిల్లా నాయకులు శంకరరావు, ఎస్‌యూసీఐసీ రాష్ట్ర నాయకులు ఎస్.గోవిందరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.జగన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.ఎస్.జె.అచ్యుతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాయకులు బి.పద్మ, ఎం.డి.బేగం, పి.మణి, ఎ.దేముడమ్మ, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధం



సీపీఎం నాయకుడు రామును అచ్యుతాపురంలో గృహ నిర్బంధం చేసిన పోలీసులు



సీపీఎం నాయకుడు అప్పలరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

సాక్షి, విశాఖపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ రాక సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సీపీఎం నాయకులను పోలీసులు ముందుస్తుగా గృహ నిర్బంధం చేశారు. విశాఖలో ఏయూ మైదానంలో జరగనున్న ప్రధాని మోదీ సభ ప్రాంగణం వద్ద , నక్కపల్లి, పూడిమడకలలో వేదికల వద్ద నిరసనలు వ్యక్తం చేయకుండా ముందస్తు గృహ నిర్బంధం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సీపీఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్. రాము, మండల కమిటీ సభ్యులు సోమునాయుడు, కె.కోటపాడు మండల పార్టీ నాయకులు యర్రా దేముడు, రాజయ్యపేట సీపీఎం నాయకుడు మహేష్‌లను గృహ నిర్బంధం చేశారు. నిర్వాసిత గ్రామాల్లో పోలీసులు భారీగా మోహరించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నక్కపల్లి, అచ్యుతాపురం సహా జిల్లాలోని సీపీఎం నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. అంతేకాకుండా సీపీఎం, సీపీఐ నేతల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. నాయకుల గృహ నిర్బంధాన్ని సీపీఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులను భారీగా మోహరించారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన రద్దు చేయాలని మత్స్యకారులు, రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ నిరసన తెలపాలని సీపీఎం ఇప్పటికే పిలుపునిచ్చింది. మోదీ సభకు, వర్చువల్ కార్యక్రమానికి వెళ్లకుండా తమ నిరసన తెలపాలని ఇచ్చిన పిలుపుపై ప్రజల నుంచి స్పందనరావడంతో ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దించింది. ఆందోళనలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. నిరసనలు జరగకుండా, ప్రజలను బస్సుల్లో దగ్గరుండి తీసుకెళ్లే బాధ్యతను వీఏవో, వీఆర్‌పీలకు అప్పగించారు. సమస్యలను పరిష్కరించకుండా ప్రశ్నిస్తున్న సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడమంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే అవుతుందని సీపీఎం, పలు ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

బైక్‌పై హైటెక్ హరిదాసు



రోజులు మారుతున్నాయి. కాలంతో పాటే సంస్కృతి, సంప్రదాయాలు కూడా రూపం మార్చుకుంటున్నాయి. టెక్నాలజీ, అవసరాలకు అనుగుణంగా వృత్తులు కూడా మారిపోతున్నాయి. ధనుర్మాసంలో, ముఖ్యంగా సంక్రాంతి పండగ రోజుల్లో ఇంటింటికీ వచ్చి బియ్యం, ధాన్యం తీసుకునే హరిదాసు వేషం కూడా మారిపోయింది.నుదుట తిలకం, ఓ చేతిలో చిడతలు, మరో చేతిలో వీణ, తలపై అక్షయపాత్ర, దాని చుట్టూ పూలదండ, కాలికి గజ్జెలు, మెడలో పూలహారంతో ఇంటింటికీ వచ్చే హరిదాసుల తీరు ఇప్పుడు తీరుమారింది. హరి కీర్తనలను ఆలపించడం మానేశారు. ఎంచక్కా టెక్నాలజీని ఉపయోగించడం మొదలుపెట్టారు. వీణను, చిడతలను పక్కన పెట్టేశారు. బైక్‌కు మైక్ కట్టి తన వద్ద ఉన్న మొబైల్‌ఫోన్‌లో సేవ్ చేసి ఉన్న హరి కీర్తనలను బ్లూటూత్ ద్వారా కనెక్ట్ చేసి వినిపిస్తూ గ్రామాల్లో తిరుగుతూ భక్తులు ఇచ్చిన కొత్తధాన్యం, బియ్యం, నగదు, నూతన వస్త్రాలు స్వీకరిస్తున్నారు. రయ్ రయ్‌మంటూ ఊళ్లోకి వస్తూ వీధుల్లో తిరుగుతూ వెళ్లిపోతున్నారు. కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన గోవిందరాజు అనే హరిదాసు మండలంలోని గొడిచర్ల, ముకుందరాజుపేట, జగన్నాథపురం, రేబాక తదితర గ్రామాల్లో తిరుగుతూ కానుకలు స్వీకరిస్తున్నారు. –నక్కపల్లి

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



మూలపేటలో మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా మేలుకొలుపులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ధనుర్మాసంలో భాగంగా ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం పలు గ్రామాల్లో నిర్విరామంగా సాగుతోంది. భక్తులు శివపార్వతుల చిత్రపటాలను చేతబట్టి భజనలు చేస్తూ దేవతామూర్తులను తెల్లవారుజామున నిద్రలేపుతున్నారు. మునగపాక, వాడ్రాపల్లి, మూలపేట, గవర్ల అనకాపల్లి, గణపర్తి, చూచుకొండ తదితర గ్రామాల్లో మంగళవారం జరిగిన మేలుకొలుపులో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హంస వాహనంపై వెంకన్న



నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం హంస వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా కొండపై స్వామివారి మూలవిరాట్‌కు, స్వామివారి ఉత్సవ మూర్తులు, గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు, అర్చనలు చేశారు. అనంతరం హంస వాహనంపై ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి ఊరేగించారు. అనంతరం తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్ఠి, ప్రసాద నివేదన జరిగింది. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి కోరారు. స్థానిక గాంధీనగరం సంయుక్త జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిల్చున్న డాక్టర్ సుంకర శ్రీనివాసరావుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ముఖ్య సలహాదారుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తులసివిష్ణుప్రసాద్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు, కార్యదర్శి రమణ, కోశాధికారి ప్రసాద్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్(ఐటీ విభాగం) డాక్టర్ ఎస్.కె.ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

అప్పలనాయుడుకు అభ్యుదయ రైతు పురస్కారం



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి పురస్కారం అందుకుంటున్న అప్పలనాయుడు

కశింకోట: మండల కేంద్రం కశింకోటకు చెందిన ఆళ్ల అప్పలనాయుడుకు అభ్యుదయ రైతు పురస్కారం లభించింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గుంటూరులోని రైతు నేస్తం ఫౌండేషన్, విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కృష్ణదేవరాయలు నుంచి ఈ పురస్కారం అందుకున్నట్టు అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. తనకు పురస్కారం అందించిన రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ ఎండ్లపల్లి వెంకటేశ్వరరావు, తదితరులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మ్యూజిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు


విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో సంగీత సంబంధిత డిప్లమో / పీజీ డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయింది. ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, ఓకల్–ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ కోర్సులకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డీపీ నాయుడు కోరారు. దరఖాస్తులకు ఈ నెల 23 వరకు గడువు ఉందని, 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు పోస్ట్ భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగంలో ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు(ఐసీఎన్) ఉద్యోగం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హెల్త్ కేర్ అసోసియేటెడ్ ఇన్ఫెక్షన్స్(హెచ్ఏఐ) సర్వైలెన్స్, నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)లో భాగంగా ఈ పోస్టును భర్తీ చేస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 17లోగా పరిపాలనా కార్యాలయం, ఆంధ్రా మెడికల్ కాలేజీలో అందజేయాలని ఓ ప్రకటనలో సూచించారు.

రంగురాళ్ల తవ్వకాలపై నిఘా

- బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పర్యవేక్షణ



కరక, ఆరిలోవ ప్రాంతంలో లభించే రంగురాళ్లు



నర్సీపట్నం: పండగ హడావుడిని ఆసరాగా చేసుకుని రంగురాళ్ల తవ్వకాలకు ఆస్కారం ఉండడంతో అటవీశాఖ ముందుస్తుగా అప్రమత్తమైంది. ఇప్పటికే జరిగిన ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘాకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా బేస్‌క్యాంపుల నిర్వహణ, నిత్యం పర్యవేక్షణకు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. పండుగ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండరనే ఉద్దేశంతో తవ్వకాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. అత్యంత విలువైన వైఢూర్యాలు లభించే గొలుగొండ మండలం అటవీ ప్రాంతంపై అటవీ అధికారులు నిఘా కట్టుదిట్టం చేశారు. కరక, సాలికమల్లవరం, ఆరిలోవ అటవీ ప్రాంతాల్లోని రంగురాళ్ల క్వారీల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన వారిపై గతంలో అటవీ అధికారులు బైండ్‌వర్ కేసులు పెట్టారు.

క్వారీని మూయించి నిరంతరం గస్తీ...

గొలుగొండ మండలంలో 1,250 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. 2005లో కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు ముమ్మరంగా సాగేవి. అదే ఏడాది జనవరిలో కరక క్వారీ కూలి ఇద్దరు మృతిచెందగా... కొంత మంది గాయపడ్డారు. దీంతో క్వారీని మూయించి నిరంతరం గస్తీలో భాగంగా ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్ నేటికి నడుస్తోంది. పక్కాగా పహారా ఉన్నా 2021 ఆగస్టు 20వ తేదీన కొంతమంది కరక కొండపై తవ్వకాలకు సిద్ధమయ్యారు. విషయం తెలియడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తవ్వకాలకు మాటువేసి ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా రంగురాళ్ల తవ్వకాలకు సహకరించిన వ్యక్తి డీఎఫ్‌వో వద్ద అవుట్ సోరింగ్ పద్ధతిలో పని చేస్తున్న కారు డ్రైవర్ కావడంతో అధికారులు విస్తుపోయారు. దీంతో అటవీ అధికారులు క్వారీ ప్రాంతంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆరిలోవ అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బంది దాడులు నిర్వహించారు. సిబ్బందిపై రాళ్లు రువ్వి తవ్వకందారులు తప్పించుకున్నారు. లోతుగా విచారణ చేసి ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పట్లోనే 27 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

అలెక్స్‌రకం రంగురాళ్లకు గిరాకీ

క్వారీల్లో లభ్యమయ్యే అలెక్స్‌రకం రంగురాళ్లకు గిరాకీ ఉంది. ఇవి నాణ్యమైన వజ్రాల మాదిరిగానే ఉంటాయి. కోట్ల రూపాయల్లో ధర పలుకుతాయి. ఇంతటి విలువ ఉన్నందునే రంగురాళ్ల వ్యాపారులు వీటి కోసం తరచూ తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారు. సంక్రాంతి పండుగ హడావుడిలో అధికారులు ఉండటాన్ని గమనించి తవ్వకాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. అటవీ అధికారులు అప్రమత్తమై క్వారీల వద్ద నిఘా కట్టుదిట్టం చేశారు.

భద్రత కట్టుదిట్టం...



ఆరిలోవ, కరక క్వారీపై మరింత నిఘా ఉంచుతున్నాం. రాత్రింబవళ్లు సిబ్బందిని నియమించాం. రిజర్వ్‌డు ఫారెస్టులో ప్రవేశం నిషిద్ధం. అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించికూడదు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఆ ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు తవ్వకాలకు పాల్పడితే ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను రద్దు చేస్తాం. చట్టాలను అతిక్రమిస్తే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తాం.

– లక్ష్మీనర్సు, రేంజర్, నర్సీపట్నం

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న స్వామీజీలు, సాధుసంతులు, పీఠాధిపతులు



అధిక సంఖ్యలో తరలివచ్చిన స్వామీజీ భక్తులు, శిష్యులు

- కొత్తపెంటలో ముగిసిన దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం
- పెద్ద సంఖ్యలో హాజరైన స్వామీజీలు, సాధు సంతులు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సద్గురు దేవానంద సరస్వతి మహారాజ్ (రిషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. దేశ నలుమూలల నుంచి స్వామీజీ భక్తులు, శిష్యులు తరలి రావడంతో ఆశ్రమ పరిసరాలు కిక్కిరిశాయి. తెల్లవారు జాము నుంచి స్వామీజీ విగ్రహాన్ని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దీంతో ఆశ్రమ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సుప్రభాతం, పతాకావిష్కరణ, నగరసంకీర్తన, భగవద్గీత పారాయణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 25 మంది స్వామీజీలు, సాధుసంతులకు భక్తులు పాద పూజ చేశారు.

స్వామీజీల ప్రవచనాలతో పులకించిన భక్తులు

రిషీకేష్ నుంచి వచ్చిన పద్మనాభానంద స్వామీజీ మహరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భీమిలి నుంచి హాజరైన రామకృష్ణానంద, హైదరాబాద్‌కు చెందిన భారతీ తీర్థ, సన్మాన గ్రహీత పశర్లపాటి శ్రీనివాస్ బంగారయ్య శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి తదితరుల ప్రవచనాలతో భక్తులు పులకించారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి పూజలు



దేవానంద స్వామీజిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దేవానంద స్వామీజీని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను సభా వేదికపై ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. దేవానంద స్వామీజీని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి. కుమార్, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు తదితరులు దర్శించుకున్నారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సద్గురు దివ్య జీవన ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డి పైడిపునాయుడు, కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహమూర్తి, కోశాధికారి పసగాడ ముత్యాలు, స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు పట్టని ఆటో కార్మికుల సంక్షేమం





సదస్సులో మాట్లాడుతున్న ఆటో వర్కర్లు,డ్రైవర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్, హాజరైన ఆటో డ్రైవర్లు

- ఆటో వర్కర్లు, డ్రైవర్ల సంఘం ఉపాధ్యక్షుడు రెహమాన్
- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోతే ఆందోళన తప్పదు
- యలమంచిలిలో ఆటో, మోటారు కార్మికుల సదస్సు, ర్యాలీ

యలమంచిలి రూరల్: ఆటో, మోటారు కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఆటో వర్కర్లు, డ్రైవర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయం వద్ద యలమంచిలి డివిజన్ ఆటో, మోటారు కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. భారీగా బీమా, రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్ వసూలు చేయడంతో పాటు రవాణా, పోలీసు శాఖల అధికారులు ఎడాపెడా జరిమానాలు విధిస్తూ ఆటో కార్మికులను రోడ్డున పడేస్తున్నారన్నారు. ఆటో కార్మికులపై ఆర్థిక భారం మోపే జీవోలు 21, 31లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల నుంచి వసూలు చేస్తున్న ట్యాక్సుల్లో ఒక శాతం సెస్సును కార్మికుల సంక్షేమం కోసం కేటాయించడంతో పాటు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ప్రయాణికుల ఆక్యుపెన్సీ లేక నష్టాలతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్లకు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రాష్ట్రంలో ఉగాది నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామన్న ప్రభుత్వం ప్రకటన ఉందన్నారు. ఆటో కార్మికులపై విధించే జరిమానాలు తగ్గించడంతో పాటు వారికి తెలీకుండా వేస్తున్న ఆన్‌లైన్ జరిమానాలు, కేసులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తరచుగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వారి జీవనోపాధిని దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోబోమని, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. యలమంచిలి పట్టణ, రూరల్ ఎస్ఐలు కె.సావిత్రి, ఎం.ఉపేంద్ర మాట్లాడుతూ ఆటో డ్రైవర్లంతా రహదారి నిబంధనలు పాటిస్తూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలని సూచించారు. అనంతరం స్థానిక గాజువాక బైపాస్ రోడ్డు నుంచి దిమిలి రోడ్డు కూడలి వరకు ఆటో కార్మికులు తమ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి గనిసెట్టి ఏసుదాసు, ఆటో యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.కాసుబాబు, యలమంచిలి పట్టణ, రూరల్ ఆటో కార్మికుల సంఘం అధ్యక్షులు అల్లిమళ్ల నాగు, కొటారు తాతాజీ, ఆటో యూనియన్ల సంఘాల నాయకులు బంగారు అప్పలనాయుడు, లక్ష్మీబాబు, ఎస్.శివ, బాషా, విశ్వనాథం, 15 ఆటో స్టాండ్లకు చెందిన సుమారు 350 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అధికారులు రాలేదని జేపీ అగ్రహారం గ్రామస్తుల ఆగ్రహం

- వాయిదా పడిన రెవెన్యూ సదస్సు



సదస్సు వాయిదా వేయాలని అధికారులను నిలదీసిన గ్రామస్తులు

రోలుగుంట: అధికారుల పూర్తిస్థాయిలో హాజరు కాక, అర్జీదారులు అడిగిన సమస్యలపై సరైన సమాధానం లేక జె.పి.అగ్రహారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సమాధానం లేని రెవెన్యూ సదస్సు ఎందుకని, వాయిదా వేయాలని డిమాండ్ చేయడంతో అధికారులు వెనుదిరిగారు. మండలంలో జె.పి.అగ్రహారంలో రెండు వారాల క్రితం వాయిదా పడిన రెవెన్యూ సదస్సు మరలా మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్ఐ, మండల సర్వేయర్ మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ రాకుండా సదస్సు ఎలా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు నిలదీశారు. దీనిపై ఆర్ఐ రామూర్తి, సర్వేయర్ తవుటునాయుడు స్పందించి వారు ఇతర సమావేశాలకు వెళ్లారని సమాధానమిచ్చారు. కొంతమంది ఈనాం భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారు. సాగులో ఉండి అర్హతలున్న వారికి ఇంకా పాసు పుస్తకాలు జారీ చేయలేదు. ఇటువంటి కీలక సమస్యలు పరిష్కరించాల్సిన తరుణంలో అధికారులు రాకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేయడంతో సదస్సు వాయిదా పడింది.

'విమానాశ్రయాన్ని నేవీకి అప్పగించే ప్రతిపాదన లేదు'

ఏయూక్యాంపస్: విశాఖ విమానాశ్రయాన్ని నౌకాదళానికి అప్పగించే ప్రతిపాదన లేదని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మీడియాలో వస్తున్న అసత్య కథనాలను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా వాణిజ్య కార్యకలాపాలు మాత్రమే నిలిపివేయడం జరుగుతుందన్నారు. విమానాశ్రయానికి సంబంధించిన ఆస్తులు, భూములు మాత్రం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆధీనంలోనే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

సింటర్ ప్లాంట్ కన్వేయర్ల పునరుద్ధరణ

ప్రారంభమైన సింటర్ ఉత్పత్తి



ప్రారంభమైన కన్వేయర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో కన్వేయర్లు పునరుద్ధరించారు. దీంతో ఉత్పత్తి పునఃప్రారంభమైంది. సింటర్ ప్లాంట్ విభాగంలోని మూడు సింటర్ మిషన్లలో రెండు మిషన్లకు ముడిసరకు సరఫరా చేసే ఏ1, ఏ2 కన్వేయర్ల గ్యాలరీ ఈ నెల 3న కుప్ప కూలిన విషయం తెలిసిందే. దీంతో ఆ విభాగంలో సింటర్ ఉత్పత్తితోపాటు, రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో పూర్తి ఉత్పత్తికి అంతరాయం కలిగింది. తద్వారా ఈ నాలుగు రోజులు హాట్ మెటల్ ఉత్పత్తి తగ్గింది.

రాత్రింబవళ్లు పునరుద్ధరణ పనులు చేపట్టారు. మంగళవారం ఉదయం ఏ2 కన్వేయర్, సాయంత్రం ఏ1 కన్వేయర్‌ను ప్రారంభించారు. దీంతో క్రమంగా ఉత్పత్తిని పెంచనున్నారు. ఒకట్రెండు రోజుల్లో రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో ఉత్పత్తిని పూర్తి స్థాయికి తీసుకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

పరామర్శకు తోడు వెళ్లి.. అనంతలోకాలకు..

- లారీ ఢీకొని కెమిస్ట్ మృతి
- మృతుడు శ్రీకాకుళం జిల్లా వాసి



మృతి చెందిన కునుబెల్లి రమేష్



గాయాలతో బయటపడ్డ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: రాత్రి విధులు ముగించుకుని ఆస్పత్రిలో ఉన్న తమ బంధువును పరామర్శించడానికి ఒకరికి తోడు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా, బూర్జ మండలం, నారాయణపురం నాగావళి వీధికి చెందిన కునుబెల్లి రమేష్(30) అరబిందోలోని ఏపిటోరియా ఫార్మా కంపెనీలో కెమిస్ట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గాజువాకలో తన తమ్ముడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే కంపెనీలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన కురిటి శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరావు తన స్కూటీని పాత గాజువాకలో పార్కింగ్ చేస్తాడు. అక్కడ కంపెనీ బస్సు దిగి అక్కిరెడ్డిపాలేనికి స్కూటీపై వస్తుంటాడు. ఇదిలా ఉండగా సోమవారం నైట్ డ్యూటీ చేసి మంగళవారం ఉదయం కంపెనీ బస్సులో వచ్చిన వీరిద్దరూ పాత గాజువాక వద్ద దిగారు. శ్రీనివాసరావుకు చెందిన బంధువు గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన్ని చూడటానికి ఇద్దరూ బయలుదేరారు. శ్రీనివాసరావు స్కూటీ నడుపుతుండగా రమేష్ వెనుక కూర్చున్నాడు. వారు ఆస్పత్రికి సమీపిస్తుండగా వెనుకనే వస్తున్న ఓ లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న రమేష్ కాళ్లు, నడుముకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మరణించాడు. శ్రీనివాసరావు తూలి పక్కకు పడిపోవడంతో భుజంపై గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన శ్రీనివాసరావుకు గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

న్యాయంపూడిలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి: మండలంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న న్యాయంపూడి గ్రామంలో ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు నాగనబోయిన వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి తలుపు తాళాలు పగుల గొట్టి దుండగులు ప్రవేశించారు. కప్ బోర్డులో ఉన్న బీరువా తాళాలు తెరిచి లోపల ఉన్న రూ.3లక్షల విలువైన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, రూ. 10 వేలు నగదు అపహరించారు. ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగుల గొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదు అపహరించిన విషయం గుర్తించిన వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎస్ఐ సన్నిబాబుతో పాటు క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య మందలించిందని వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన అప్పారావు

కె.కోటపాడు : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి భార్య మందలించిందన్న కోపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన పిండ్రంగి గ్రామంలో చోటు చేసుకుంది. ఎ.కోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పిండ్రంగి గ్రామానికి చెందిన గొలగాని అప్పారావు(40) సోమవారం ఉదయమే మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఆయన్ను భార్య రామలక్ష్మి మందలించి పనికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అప్పారావు ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేశాడు. ఇంటికి వచ్చి రామలక్ష్మి చూసే సమయానికి భర్త అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అప్పారావు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి శవాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

మునగపాక పీహెచ్‌సీ సందర్శన



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవికుమార్

మునగపాక: ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవికుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు.ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు విజయవంతమయ్యేలా పనిచేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డాక్టర్ విమలగిరి, సీహెచ్‌వో దేవకాంత తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో జగద్గురు పీఠం విదేశీ సాధకులు



సింహగిరిపై జగద్గురు పీఠం విదేశీ సాధకులు

సింహాచలం: అంతర్జాతీయ జగద్గురు పీఠం ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా పరిషత్ వద్దనున్న అంకుశాలో ఈ నెల 11 నుంచి జరిగే గురుపూజా మహోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు విదేశీ సాధకులు మంగళవారం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్పెయిన్, జర్మనీ, స్విట్జర్లాండ్, బెల్జియం దేశానికి చెందిన 19 మంది సాధకులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతర్జాతీయ జగద్గురు పీఠం అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ గురుప్రసాద్, జగద్గురు పీఠం డైరెక్టర్ పి. రవిశంకర్ తదితరుల ఆధ్వర్యంలో వీరు సింహగిరికి వచ్చారు.

కానిస్టేబుల్ పరీక్షలకు 254 మంది హాజరు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం 254 మంది పురుష అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు జరిగాయి. 194 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. గత నెల 31న ఈ పరీక్షలు ప్రారంభం కాగా.. గత మూడు రోజులు మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. పురుష అభ్యర్థులకు మంగళవారం నుంచి మళ్లీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఆధునిక పనిముట్లతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రామారావు

కశింకోట: ఆధునిక వ్యవసాయ పనిముట్లను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం. రామారావు అన్నారు. మండలంలోని జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. రైతులు ఆధునిక వ్యవసాయ పనిముట్లు వినియోగించడం వైపు దృష్టి నిలపాలన్నారు. పంటల సాగులో నూతన వంగడాలు నాటుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న, వీఏఏ పుష్ప, కె. రామకృష్ణ, జి. కృష్ణ, రాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్ అభిమానికి హెల్పింగ్ హ్యాండ్స్ సాయం



రాజుకు రూ.20 వేల నగదు అందజేస్తున్న చందు, జగన్‌మోహన్‌రావు తదితరులు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గ రోగులకు తమ వంతు సహాయం అందించాలని ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి పి.చందు అన్నారు. స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద విశాఖ జిల్లా గాజువాక మండలం వడ్లపూడి గ్రామానికి చెందిన వెంకటేష్ అభిమాని గరికిపాటి రాజు ఆపరేషన్ నిమిత్తం హ్యాండ్స్ సభ్యులు మంగళవారం రూ.20 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ రాజు ఇటీవల ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. వైద్యులు ముక్కుకు సర్జరీ చేయాలని చెప్పడంతో ఆపరేషన్‌కు తమ వంతు సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ సభ్యులు రోషన్, కొంగ నాగేశ్వరరావు, రాయి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ పి.వి.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,392 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,240
మొదటి రకం	4,000	5,020
రెండో రకం	3,320	4,300
మూడోరకం	3,140	3,300

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవిన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 14 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-7 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

నాడు తప్పన్నా.. నేడు తప్పలేదు



సర్వే రాళ్లపై గత ప్రభుత్వ చిహ్నాలు, పేర్లు తొలగిస్తున్న సిబ్బంది

- భూముల రీసర్వేకు ముహూర్తం పెట్టిన కూటమి ప్రభుత్వం
- ఈ నెల 20 నుంచి కొండుపాలెంలో నిర్వహణకు ఏర్పాట్లు
- జగనన్న దారిలోనే ముందుకు సాగుతున్న బాబు సర్కార్



సర్వే తీరును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తుమ్మపాల: విపరీతంగా పెరిగిపోతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా దేశంలోనే ప్రతిష్టాత్మకంగా సర్వే బృందాలను నియమించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసింది. భూముల రీసర్వే (జగనన్న భూహక్కు-భూరక్ష) పథకంతో సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసింది. అయితే దాన్నే బూచిగా చూపి రైతుల్లో తీవ్ర ఆందోళన సృష్టించిన టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చి అదే రీసర్వేకు శ్రీకారం చుడుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సర్వేలో మిగిలిపోయిన గ్రామాలకు రీసర్వే చేపడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. పాత పథకానికి కొత్తగా పైలెట్ ప్రాజెక్ట్ అంటూ మండలానికి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి పాత రీసర్వేను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే జగనన్న భూహక్కు అనే పేరును మార్చేస్తున్నారు. రీసర్వేతో చరిత్రలో నిలిచిపోయే జగన్ పేరు లేకుండా చేయడమే లక్ష్యంగా సర్వే రాళ్లపై జగన్ పేరు లేకుండా చేస్తున్నారు. ఇంత చేస్తున్నారు గానీ రీసర్వే తప్పని తేల్చలేకపోయారు. దాంతో జగన్ నిర్ణయం నూటికి నూరుశాతం మేలు చేసేదే అని స్పష్టమయింది.

చరిత్రలో నిలిచిపోయేలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే చరిత్రలో నిలిచిపోతుంది. ఏళ్ల నాటి నుంచి భూములను సాగు చేసుకుంటు జీవిస్తున్న రైతులకు రీసర్వే పథకం ఎంతో మేలు చేసింది. ఉచితంగా భూమి హక్కు పత్రాలను అందించి ప్రజల గుండెల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూముల ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు పెట్టి సాగు చేస్తున్న రైతులకు తెలియకుండానే భూములు ఇతరుల పేరిట నమోదు, విక్రయాలతో ప్రతి గ్రామంలోను భూ సమస్యలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో కోర్టుల్లో వందల సంఖ్యల్లో కేసులు నమోదు కావడం, భూముల వ్యవహారంలో అనేక మంది కొట్లాటలతో దాడులకు గురవడం నిత్యకృత్యమైపోయింది. అనేక సమస్యలు ఉత్పన్నమవడంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీ సర్వేకు శ్రీకారం చుట్టి సమస్యలు లేని భూహక్కులు కల్పించింది జగన్ ప్రభుత్వం.

ఆ వ్యాఖ్యలు బూటకమని స్పష్టం..

రీసర్వే పేరుతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల భూములు దోచుకుంటున్నారు, భూములన్నీ జగన్ పేరుతో రాయించుకుంటున్నారు అనే విధంగా టీడీపీ, జనసేన నాయకులు చేసిన వ్యాఖ్యలు బూటకమని తేలిపోయాయి. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేనే కూటమి ప్రభుత్వం కూడా చేపట్టడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కూటమి నాయకుల మాటలు విని మోసపోయామంటు వాపోతున్నారు. రీసర్వేను రద్దు చేసానని చెప్పిన చంద్రబాబు మళ్లీ రీసర్వే చేపట్టడంతో అవాక్కవుతున్నారు. కేవలం జగన్‌పై కక్ష సాధింపుతోనే ఆయన జాపకాలు ప్రజల్లో లేకుండా పథకాల్లో జగన్ పేరు, చిహ్నాలు లేకుండా చెరిపేస్తున్నారు. రీసర్వేలో పాతిన రాళ్లపై జగన్ పేరు, గ్రామాల్లో వెలసిన సచివాలయ భవనాలపై చిత్రాలను తొలగించేస్తున్నారు. అయితే చిహ్నాలు, భవనాలపై జగన్ పేరు, ఫొటోలు తొలగించగలరు గానీ ప్రజల గుండెల్లో నుంచి ఆయనను చెరిపేయలేరని రైతులు, ప్రజలు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు.



రీసర్వే చేయనున్న భూములు

పైలెట్ ప్రాజెక్టుగా కొండుపాలెం..

మండలంలోని కొండుపాలెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి రీసర్వే చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పునఃప్రారంభిస్తున్న భూముల రీసర్వే పథకానికి ఒక్కో మండలం నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ నెల 20 నుండి రీసర్వే ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సర్వే బృందాలను సిద్ధం చేశారు. రోజుకు కేవలం 20 ఎకరాల వరకు మాత్రమే సర్వే చేసేందుకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు.

నాటి సర్వేలో ఎలాంటి అవకతవకలు జరగలేదు..



గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేతో పైసా ఖర్చు లేకుండా రైతులు భూమి హక్కు పత్రాలు పొందారు. సరిహద్దుదారులతో సమస్యలు, భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన నాటి సర్వేనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా చేపట్టనుంది. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేపై కూటమి నాయకులు ప్రజలను నమ్మించినట్లు ఎటువంటి అవకతవకలు జరగలేదు కాబట్టే మళ్లీ రీసర్వేను కూటమి ప్రభుత్వం మొదలెట్టింది. నాటి రీసర్వే సమయంలోని రాళ్లపై మాజీ సీఎం జగన్ పేరు మాత్రమే చెరపగలుగుతున్నారు.

– నారపిన్ని ప్రసాద్, రైతు, అక్కిరెడ్డిపాలెం

అరకొర మంచినీటి సరఫరాతో ఇక్కట్లు



గవరపేటలో పాత్రలతో నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

కశింకోట: కశింకోటలోని గవరపేట కనకమహాలక్ష్మి వీధి, పెద్దగుమ్మం వీధి ప్రాంతాల్లో పంచాయతీ కుళాయిల నుంచి అరకొరగా మంచినీరు సరఫరా అవుతుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొద్ది రోజులుగా చిన్న ధారతో తక్కువ నీరు సరఫరా అవుతుండటంతో నీరు సరిపోక నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్ని చోట్ల చిన్న పాత్రల సహాయంతో నీటిని బిందెల్లోకి తోడి పట్టుకోవలసి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఎక్కువ సమయం కుళాయిల వద్ద నిరీక్షించాల్సి వస్తోందంటున్నారు. కొందరు అనధికారిక కుళాయి కనెక్షన్లు ఇంట్లో వేసుకోవడమే కాకుండా వాటికి మోటార్లు అమర్చి నీటిని తోడేస్తుండటం వల్ల కుళాయిల నుంచి సరిగా నీరు రాని పరిస్థితి ఉందంటున్నారు. నీటి సమస్యపై పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతోందని విమర్శిస్తున్నారు. నీరు దొరక్క బాటిళ్లు కొని తాగాల్సి వస్తోందంటున్నారు. దీని దృష్ట్యా అనధికారిక కుళాయిలు, మోటార్లు తొలగించి పూర్తి స్థాయిలో నీరు సరఫరా అయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

నేడు శ్రీవారి కల్యాణోత్సవ పెళ్లి రాట

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 9 గంటలకు పెళ్లి రాట కార్యక్రమం జరగనుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10న స్వామి కల్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. దీనిని పురస్కరించుకుని మూడు రోజుల ముందుగా సంప్రదాయబద్ధంగా నేరేడు కొమ్మ తెచ్చి వేద మంత్రాల నడుమ పూజలు నిర్వహించి పెళ్లి రాట వేస్తామన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అరెస్టులు అన్యాయం

అనకాపల్లి: ప్రధాని మోదీ బహిరంగ సభను పురస్కరించుకుని జిల్లాలో సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో అరెస్టులు లేవని చెబుతుంటే అరెస్టులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు.

ప్రత్యేక వైద్య సేవలందించాలని వినతి

అనకాపల్లి: శీతాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, వృద్ధులు, చిన్నారులు ఆస్పత్రికి వచ్చే సమయంలో ప్రత్యేక వైద్యసేవలు అందించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చిన్నయాదవ్ అన్నారు. స్థానిక ఏఎంసీ కాలనీ ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు ప్రియాంకతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో కొంత మంది సిబ్బంది రోగులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆటువంటి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అస్పత్రిలో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. పలు సంఘాల నాయకులు బొడ్డు సోమరాజు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు, ముగడ అప్పారావు, సత్య అప్పారావు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో మరమ్మతు, కొత్త లైన్ల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈనెల 8, 9 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ కె.రాజశేఖర్, డి-1 సెక్షన్ ఏఈ త్రినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కె.వి. టౌన్-1 ఫీడర్ పరిధిలో గుండాలవీధి, లక్ష్మీదేవిపేట, పాత కోర్టు వీధి, గాంధీనగరం, అంజయ్యకాలనీ, విజయరామరాజుపేట, మిరియాలకాలనీ, ఏఎంసీ కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి, అలాగే 9వ తేదీన 11 కె.వి. లక్ష్మీనారాయణనగర్ ఫీడర్ పరిధిలో తాకాసి వీధి, ఎల్ఎన్ నగర్, మళ్లవీధి, పిల్లావారివీధి, రైల్వే స్టేషన్‌రోడ్డు, 11 కె.వి. ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో నర్సింగరావుపేట, చవితివీధి, దుర్గాలాడ్జి వీధి, జీవీకోటేశ్వరరావు వీధి, కోట్నివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

వేతనాలు పెంచాలని స్కీమ్ కార్మికుల వినతి



ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోన లక్ష్మణ్ తదితరులు

అనకాపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో స్కీమ్ కార్మికులు కీలకంగా పని చేస్తున్నారని ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపుదలకు, స్కీమ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ. 26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లతో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వాయిబోయిన శేఖర్, కాండ్రేగుల మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత బాలకృష్ణకు ఘన నివాళి



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నేత స్వర్గీయ ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి వేడుకలు మంగళవారం జరిగాయి. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతంలో సీపీఎం ఎదుగుదలకు పునాదులు వేసిన నేత మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎస్ఈజెడ్ భూములు కోల్పోయిన రైతుల కోసం ఎన్ఏవోబీ రైతుల పోరాటం, నల్ల బెల్లం, షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ, రైవాడ రైతుల సమస్యలపై జిల్లాలో అనేక పోరాటాలు చేసి రైతులకు న్యాయం చేసిన నాయకుడు ఆయన అన్నారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడు మన మధ్య లేకపోవడం బాధాకరం అన్నారు. ప్రజల సమస్యలను ఉద్యమాల ద్వారానే సాధించుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, గంటా సుభాషిణి, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై మోదీ వైఖరి స్పష్టం చేయాలి



పూడిమడక జాతీయ రహదారిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు విశాఖ పర్యటనలో ప్రధాని మోదీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక పూడిమడక జాతీయ రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ.18 వేల కోట్ల ప్యాకేజీ వంటి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు, పన్ను, విద్యుత్ రాయితీలు కల్పించకుండా ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని సదుపాయాలు కల్పించడమంటే ఆంధ్ర ప్రజలను మోసం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ పార్కును రాష్ట్ర ప్రభుత్వం నక్కపల్లిలో ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. హెటిరో డ్రగ్స్ కంపెనీతో నక్కపల్లి ప్రజలంతా వాయు, జల కాలుష్యంతో ఇబ్బందులు పడుతూ అనేక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కె.ఈశ్వరరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎం.రమణ, పి.చలపతి, జి.సుభాషిణి, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌లా ఉక్కు ప్రైవేటీకరణ వద్దనే దమ్ముందా?'



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్

అనకాపల్లి: దశాబ్దాల పోరాటంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన వైఖరి చెప్పకపోవడంలో ఆంతర్యం ఏమిటని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో నిలదీశారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం పన్నిన కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికుల 1400 రోజులకు పైబడి ఆందోళనలు చేస్తుంటే, ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడకుండా కొత్తగా మరో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని చంద్రబాబునాయుడు, మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్లాంట్‌ను రక్షించే బాధ్యత మాపై ఉందని చెప్పి అధికారం చేపట్టిన కూటమి నాయకులు ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ప్లాంట్‌ను ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యతిరేకించారని అన్నారు. ప్లాంట్ పరిరక్షణ బాధ్యత టీడీపీ-జనసేనలదే అన్నారు.

విద్యార్థులు చేరని పాఠశాలలపై నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: సాక్షి కథనానికి జిల్లా విద్యా శాఖ అధికారి జి. అప్పారావునాయుడు స్పందించారు. మండలంలో ఒకే విద్యార్థితో నడుస్తున్న 4 ప్రాథమిక పాఠశాలల విషయమై 'పాఠశాలకు ఒకే ఒక్కడు' శీర్షికన గత నెల 30న సాక్షిలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన డీఈవో ఈ విషయాన్ని పరిశీలించి కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, అడ్డాం, బుచ్చియ్యపేట పాఠశాలల్లో ఒక విద్యార్థి మాత్రమే చదువుతుండటానికి, ఎక్కువ మంది విద్యార్థులు చేరకపోవడానికి గల కారణాలపై నివేదించాలని ఆదేశిస్తూ మండల విద్యా శాఖ అధికారులకు ఉత్తర్వులు పంపారు. దీంతో ఈ విషయమై పరిశీలించి కథనం వాస్తవమేనని, ఎన్నిసార్లు ప్రయత్నించినా తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా పాఠశాలల్లో చేర్పడానికి ముందుకు రాలేదని నివేదించినట్లు సమాచారం.

రైతులకు సస్యరక్షణలో మెలకువలు



మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల వల్ల వరి నారుమడిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి నాటే రైతులు, ఆఖరి దమ్ములో ఎకరాకు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేసి నాట్లు వేసుకోవాలని తెలిపారు. అపరాలలో పల్లాకు తెగులు గమనించినట్లయితే తెగులు ఉన్న మొక్కలను పీకివేయాలని, బూడిద తెగులు కూడా ఆశించవచ్చని, నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటర్ పిచికారీ చేసుకోవాలన్నారు. నువ్వు పంట సాగు చేసుకోవడానికి ఇది సరైన సమయమని, నువ్వు పంట విత్తే రైతులు వైఎల్ఎం 66 రకాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తే ముందు కిలో విత్తనానికి, కార్బెన్డజిమ్ 1 గ్రాముతో విత్తనశుద్ధి చేయడం మేలని, నువ్వులను వెదజల్లే పద్ధతిలో ఎకరాకికు 2 కిలోల విత్తనాన్ని 2 కిలోల ఇసుకలో కలిపి వెదజల్లుకోవాలని చెప్పారు. ఎకరాకు 10 కిలోల ట్రైకోడెర్మా, ఒక బస్తా డీఏపీని నువ్వులు విత్తేముందు ఆఖరి దుక్కిలో వేసుకోవాలని, వర్షాధారపు చెరకులో పొలుసు పురుగు రావచ్చని, పురుగు వ్యాప్తి అరకట్టడానికి ఎండు ఆకులు (మొవ్వులో కనీసం 8 ఆకులు ఉంచి) డైమిథోయేట్ 1.7 మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు తీగ జాతి కాయగూరల్లో ఆకు మచ్చ తెగులు ఆశించవచ్చని, నివారణకు మాంకోజెబ్ 3.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మామిడిలో తేనే మంచు పురుగు నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.4 మిల్లీ లీటర్లు లేదా బుప్రోఫెజిన్ 1.6 మిల్లీలీటర్లు కార్బెండిజం 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పూత, పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులపైనే కాకుండా మొదళ్లు, కొమ్మలపై కూడా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవానీ, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ల మరమ్మతుకు వినతి

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలో ఫ్లైఓవర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఆర్ అండ్ బీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జగన్నాథ మురళికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారదా నది, కొత్తూరు బ్రిడ్జిలు గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారాయని, జాతీయ రహదారి కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జికి ఆనుకుని నీరు ప్రవహించడం, పెద్దపెద్ద గోతుల్లో వాహనాలు పాడైపోతున్నాయని, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలన్నారు. బ్రిడ్జిలపై చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు వనమాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

18న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేరుగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు వాకాడ బాబు, వేల్పుల గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు తెల్లవారుజాము నుంచి ఆదివారం ఉదయం వరకూ అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవానికి సుమారు లక్ష మంది భక్తులు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ లైటింగ్ ఉంటాయన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.

నాయకుల గృహ నిర్బంధం



పోలీసుల నిర్బంధంలో సీపీఐ నాయకుడు శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు వరలక్ష్మి

కశింకోట: స్థానిక సీపీఎం నాయకులను మంగళవారం రాత్రి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఎటువంటి ఆందోళనలు తలెత్తకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలకు పూనుకున్నారు. దీనిలో భాగంగా మండల సీపీఐ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మిలను గృహ నిర్బంధం చేశారు. ఇది అన్యాయమని వారు ఈ సందర్భంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తుంటే నిర్బంధనలకు పాల్పడుతుండటం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా 33 మంది ఆత్మార్పణతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించడం గాని, ప్రైవేటీకరణ నిలుపుదలకు ప్రయత్నం గానీ చేయలేదని విమర్శించారు. నక్కపల్లి వద్ద మాత్రం ప్రైవేటు కార్పొరేట్ శక్తులు ఏర్పాటు చేసే కంపెనీ పనులు ప్రారంభిస్తుండటం సరి కాదన్నారు. ప్రజల కోసం ప్రశ్నించే సీపీఎం నాయకుల అరెస్టులు, అక్రమ నిర్బంధాలు మానుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మహిళల రక్షణకు కల్పించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో భూ కబ్జాలు రూపుమాపాలన్నారు.